క్లుప్తంగా

బీజేపీలో చేరికలు

కమలాపూర్: మండలంలోని ఉప్పల్ ఉపసర్పంచ్, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మొర్రి ఓదెలు శుక్రవారం బీజేపీలో చేరారు. అతనికి హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఈటల రాజేందర్ శామీర్‌పేటలోని తన నివాసంలో కండువా కప్పి ఆహ్వానించారు.

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన పలువురు గౌడ సంఘం నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి రాష్ట్ర నాయకుడు సమ్మిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సదానందం, శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌టీపీ సంపూర్ణ మద్దతు

వేలేరు : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో వైఎస్‌ఆర్‌టీపీ శ్రేణులంతా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల ఇర్మియా ప్రకటించారు. వైఎస్‌ఆర్‌టీపీ మండల అధ్యక్షుడు ఏడపెల్లి నిఖిల్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర కండువా కప్పి ఆహ్వానించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంపీటీసీ

ఆత్మకూరు : మండలంలోని గూడెప్పాడ్ ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి శుక్రవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాస గృహంలో శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అతనికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ ప్రచారంపై ఫిర్యాదు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యనారాయణరావు ఎన్నికల ప్రచారంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, ఎంపీఓ రంజిత్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రచార షెడ్యూల్‌ను మార్చుకొని ఇతర గ్రామాల్లో ప్రచారం చేయడం కోడ్ ఉల్లంఘనే అవుతుందన్నారు. గండ్ర సత్యనారాయణరావు 18వ తేదీన నర్సింహులపల్లి, గట్లకానిపర్తి, సూరంపేట, అరెపల్లి, శాయంపేట గ్రామాల్లో ప్రచారం చేసేందుకు ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. కానీ 18వ తేదీన ప్రచారం నిర్వహించాల్సిన గ్రామాల్లో 17వ తేదీనే ప్రచారం చేశారని, దీంతో కోడ్ ఉల్లంఘించినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి తదుపరి చర్య తీసుకుంటారని వెల్లడించారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషం


టేకుమట్ల : మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి


శాయంపేట: ప్రచారం చేస్తున్న ప్రియాంకరెడ్డి, వైశాలిరెడ్డి, నాయకులు

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపేడు, వెల్లంపల్లి, కుందనపల్లి, బండపల్లి, గుమ్మడవెల్లి, దుబ్యాల, మందలోరిపల్లి, ఆరెపల్లి, రాఘవరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలగాణలో పల్లెలన్ని అభివృద్ధి పథంలో పయణించేందుకు ప్రత్యేకంగా నిధులు, పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పల్లె ప్రకృతి వనం, రైతు వేదిక, హరితహారం, అవెన్యూ ప్లాంటేషన్ వంటి పథకాలతో పల్లెలన్ని అందంగా మారాయని అన్నారు. అంతే కాకుండా రైతులకు పెట్టుబడి సాయం, 24గంటల విద్యుత్, రైతు బీమా, రుణమాఫీ ప్రకటించి వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారని అన్నారు. దళిత బంధు, బీసీ బంధు, కులవృత్తులకు పెద్దపీట వేశారని, విద్యార్థుల కోసం అల్పాహారం, హాస్టల్‌లతో ఉన్న విద్యను అందిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్ కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. ప్రతిపక్షాల మాయ మాటలకు మోసపోవద్దని, అభివృద్ధిని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బస్వరాజు సారయ్య, ఎంపీ దయాకర్, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, ఆకునూరి తిరుపతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సంగి రవి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

శాయంపేట : బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆయన కూతురు గండ్ర ప్రియాంకరెడ్డి, కోడలు గండ్ర వైశాలినిరెడ్డి శుక్రవారం మండలంలోని పెద్దకోడెపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గండ్ర వెంకటరమణారెడ్డికి ఓటువేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ లతాలక్ష్మణ్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మోహిబూబ్‌బొద్దిన్, ఎంపీటీసీలు ప్రసాద్, మంగమ్మరవి, మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, అశోక్, కిరణ్, మల్లయ్య, తిరుపతి, విజయ్, నరేష్, రవీందర్, సదానందం, రమేష్, రామ్మూర్తి, రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు


శాయంపేట : పూలతో అలంకరించిన పుట్ట

శాయంపేట : మండలంలోని తహరాపూర్ నాగేంద్ర స్వామి ఆలయంలో నాగులచవితి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మహిళా భక్తులు పుట్టను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పెద్దకోడెపాక రాజేరాజేశ్వర స్వామి ఆలయం, శాయంపేటలోని శివ మార్కండేయ, శ్రీమత్స్యగిరిస్వామి ఆలయాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు అనుదీప్ శర్మ, మార్త రాజకుమార్, ఆరుట్ల కృష్ణమాచార్యులు, రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోసి చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు సూర్యప్రకాష్, భిక్షపతి పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల: పట్టణంలో నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో కోమాళ్లపల్లి సంపత్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని నాగేంద్ర స్వామి పుట్ట వద్ద పాలు పోసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్‌తో అభివృద్ధి సాధ్యం

ధర్మసాగర్: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కర్ణాటక రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండురావు అన్నారు. మండలంలోని మల్లక్‌పల్లి, ధర్మపురం, కరుణాపురం, కాజీపేట మండలం రాంపూర్ గ్రామాల్లో శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగపురం ఇందిర తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ అవినీతి పాలన రాజ్యమేలుతుందని ఆరోపించారు. నియోజకర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఇందిరను గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సపక్‌థాక్రా జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి తెలిపారు. ఈనెల 16న జాకారంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పదోతరగతి చదువుతున్న నవ్యశ్రీ, దివ్యశ్రీ, 9వ తరగతి చదువుతున్న కృష్ణవేణి, సిరి, రజిత, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో ఈనెల 19, 20వ తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి, వైస్ ప్రిన్సిపాల్ వసంత, పీఈటీ అమృత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఉపన్యాస పోటీల్లో..

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని లక్కి ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బయ్యా సునీత శుక్రవారం తెలిపారు. జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం సహకారంతో 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై పాఠశాల స్థాయి, జిల్లా స్థాయిలో ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో లక్కి మొదటి స్థానంలో నిలవగా రూ.3వేలు నగదు బహుమతితో పాటు షీల్డు కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు లక్కిని అభినందించారు.

నిరుద్యోగులను మోసం చేసిన సీఎం కేసీఆర్


రోడ్డుపై నినాదాలు చేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులకు గతంలో హామీలు ఇచ్చి అవి అమలు చేయకుండా వారిని సీఎం కేసీఆర్ మోసం చేశారని, ఈక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ కోరారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద రోడ్డుపై శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా విద్యారంగ సమస్యలు, నిరుద్యోగులను కేసీఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య వంటి, నిరుద్యోగ భృతికి హామీలను తుంగలో తొక్కారని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కేయూ నాయకులు స్టాలిన్, మచ్చ పవన్ కల్యాణ్, ప్రవీణ్, సందీప్, రాజ్‌కుమార్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

విద్యారణ్యపురి: హైదరాబాద్‌లో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవంలో పలు సాంస్కృతిక విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) విద్యార్థిని పుష్పాల అక్షర పాల్గొని మృదంగంలో ప్రతిభ కనబరిచారు. ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి కళా ఉత్సవానికి ఎంపికయ్యారు. కాగా, ఆమెను కళాశాలలో ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ స్వరూప

ఎల్కతుర్తి: కిశోర బాలికల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సీడీపీవో స్వరూప అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం భీమదేవరపల్లి ప్రాజెక్టు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భేటీ పడావో..భేటీ బచావో కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు. లింగ నిర్ధారణ, లింగ విభేదం చూపడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలపై వివక్ష చూపకూడదన్నారు. ఏవరైనా వివక్ష చూపినట్లు తమ దృష్టికి తీసుకొస్తే చట్టపరమైన చర్య తీసుకుంటామని అన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. సూపర్‌వైజర్ శిరీష, సుజాత, కల్యాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు



శాయంపేట : తాటి చెట్టు నుంచి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడగా గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పత్తిపాకలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుమారస్వామి రోజు మాదిరిగానే తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారి చెట్టుపై నుంచి కింద పడ్డాడు. గమనించిన తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని ఆటోలో పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడిన కుమారస్వామిని గీత కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు మాచర్ల బాలకిషన్, ఉపాధ్యక్షుడు తడక సదానందం పరామర్శించారు.

ఓటు అడిగే హక్కు లేదు

పరకాల: అమరవీరుల జిల్లాగా పరకాలను ప్రకటించకుండా ఓటు అడిగే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, అమరవీరుల జిల్లా సాధించిన తరువాత ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు.

వైభవంగా కార్తీకమాస ప్రత్యేక పూజలు



ఎల్కతుర్తి: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీవీరభద్రస్వామి (శివాలయం)లో మహిళలు కార్తీక దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిపాటలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక ఇత్తడి పాత్రలో జ్యోతిని వెలిగించి ధ్వజస్తంభం చివరన ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. అలాగే నాగులపంచమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని నాగదేవునికి భక్తులు నారికేళం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

ఆత్మకూరు : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ గోపాలకృష్ణన్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని నీరుకుళ్ల, కటాక్షపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ రవిరాజు పాల్గొన్నారు.

నడికూడ: మండల కేంద్రంలోని 33,34,35 పోలింగ్ స్టేషన్లను, చెక్ పోస్ట్, ధర్మారం 68వ పోలింగ్ కేంద్రంను శుక్రవారం కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ (ఐఏఎస్) డాక్టర్ గోపాలకృష్ణన్ పరిశీలించారు. పోలింగ్ జరిగే రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు.

పరకాల : పట్టణంలోని చెక్‌పోస్టును కేంద్ర ఎన్నికల అబ్జర్వర్ (ఐఏఎస్) డాక్టర్ గోపాలకృష్ణన్ ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల నమోదు రిజిస్టర్‌లను పరిశీలించడంతో పాటు పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్న తీరును పరిశీలించారు

ధర్మసాగర్‌లో రవీష్‌గుప్తా..

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల, కరుణాపురం, కాజీపేట మండలం రాంపూర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్ గుప్తా (ఐఏఎస్) శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిన సీఎం కేసీఆర్


లింగాలఘణపురం : ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి


జఫర్‌గఢ్: కడియం సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

- పోచంపల్లి ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి

లింగాలఘణపురం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం నెల్లుట్ల సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహిళల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కడియం మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్లలో కూడా రిజర్వేషన్లు కల్పించారన్నారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న వెయ్యి మంది మహిళలకు ఒక్కో గ్రామానికి రూ.40 లక్షలతో వర్క్‌షెడ్‌లను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

మహిళల స్వయం సమృద్ధికి కృషి

మహిళల ఆర్థిక స్వయం సమృద్ధికి పోచంపల్లి ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్మన్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెయ్యి మంది మహిళలకు 45 రోజుల ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమ ముగింపు సందర్భంగా శుక్రవారం నెల్లుట్ల పరిధి ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 4,500 మందికి ఉచిత కుట్టు శిక్షణ పూర్తికాగా.. 3,500 మందికి మిషన్లు పంపిణీ చేశామన్నారు. లింగాలఘణపురం మండలంలోని వెయ్యి మంది మహిళలకు ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సూచన మేరకు రూ.2 కోట్లతో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేశామని, ఎన్నికల అనంతరం మిషన్లు కూడా అందజేస్తామని చెప్పారు. వరంగల్‌లోని టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర సంస్థల్లో మహిళలకు ఉపాధి కల్పించడంతోపాటు లింగాలఘణపురంలో ఫుడ్‌ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అపార రాజకీయ అనుభవం ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రాజకీయం అనుభవం కలిగిన వ్యక్తి కడియం

ఎంతో రాజకీయ అనుభవం కలిగిన కడియం శ్రీహరిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు ఎంతో కృషి చేశాడని, సీఎం కేసీఆర్ సహకారంతో పాటు తన ఎమ్మెల్సీ నిధులతో కూడా అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు.

సమస్యలు తెలిసిన నాయకుడు..

ముగ్గురు ఆడబిడ్డల తండ్రిగా మహిళల సమస్యలు తెలిసిన నాయకుడు కడియం శ్రీహరి అని కడియం ఫౌండేషన్ చైర్మన్ కడియం కావ్య అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తూ 30 ఏళ్ల రాజకీయ అనుభవంలో ఎంతో కృషి చేశాడన్నారు. సమావేశంలో ఎంపీపీ జయశ్రీ, జడ్పీటీసీ వంశీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో దొడ్డి కొమురయ్య స్మారక భవనం

మండల కేంద్రంలోని కురుమ సంఘం భవనంలో శుక్రవారం జరిగిన కురుమల ఆత్మీయ సమ్మేళనంలో కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట అమరుడు దొడ్డి కొమురయ్య స్మారకార్థం మండల కేంద్రంలో రూ.1 కోటితో స్మారక భవనాన్ని నిర్మిస్తానని, రూ.50 లక్షలతో మాణిక్యాపురంలో చుక్కా సత్తయ్య జ్ఞాపకార్థం కల్చరల్ భవనాన్ని నిర్మాస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు చంద్రమౌళి, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ సంపత్, మండల నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను నమ్మితే ఆగమే

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మితే ఆగం కావాల్సిందేనని కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం రాత్రి కుందారం, నెల్లుట్ల గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నెల్లుట్లలో బోనాలు, కోలాటాలతో కడియంకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ, సర్పంచ్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఈ నెల 20న స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రం, కడియం ఫౌండేషన్ చైర్మన్ కడియం కావ్య గడపగడపకు బొట్టు కార్యక్రమాన్ని చేపట్టారు.

తాటికొండలో విస్తృత ప్రచారం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ రాపోలు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టారు.

గెలిపించాలంటూ కుమార్తెల ప్రచారం

జఫర్‌గఢ్: కడియం శ్రీహరిని గెలిపించాలని కోరుతూ మండలంలోని ఉప్పుగల్లులో కడియం శ్రీహరి కుమార్తెలు దివ్య, రమ్య ఇంటింటా ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాన్ని శుక్రవారం నిర్వహించారు.

కడియం సమక్షంలో పలువురి చేరిక

మండలంలోని రేగడితండా శివారు టీబీతండాకు చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బాలస్వామి, మోహన్, శివ, శేఖర్‌తో పాటు పలువురు కార్యకర్తలు సర్పంచ్ పార్వతి రవి ఆధ్వర్యంలో కడియం శ్రీహరి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కడియం గెలుపు కోసం ఇంటింటా ప్రచారం

రఘునాథపల్లి: మండలంలోని భాంజీపేట శివారు పిట్టలగూడెంలో శ్రీహరి గెలుపు కోసం మండల రైతుబంధు సమితి కన్వీనర్ గొరిగె రవి, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

కడియం గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం

ధర్మసాగర్: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు అన్నారు.

ఆశీర్వదించండి.. రుణపడి ఉంటా


భూపాలపల్లి రూరల్: ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి


మొగుళ్లపల్లి: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: తనను ఆశీర్వదిస్తే రుణపడి ఉంటానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులతో కలిసి కీర్తిరెడ్డి శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని 1000 క్వార్టర్స్, రెడ్డి కాలనీ, రెవెన్యూ కాలనీల్లో బీజేపీ భరోసా యాత్ర గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని సింగరేణి కార్మికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గెలిసిన వెంటనే సింగరేణి ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. ఆడ బిడ్డగా ఇంటి ముందుకు వచ్చానని ఆశీర్వదించంచాలని కోరారు. కీర్తిరెడ్డి గెలుపు కోరుతూ.. సుభాస్‌కాలనీలో బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆ పార్టీ నాయకులు గడప గడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపట్టినా సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలన్నారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకులను నమ్మొవద్దని కోరారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలన్నారు. చదువు రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్సిపేట, రంగాపూర్ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు తరలివచ్చి కీర్తిరెడ్డికి మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలు మారే నాయకులు మాటలు నమ్మి మోసపోవద్దని ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వమని కోరారు. కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే 2 లక్షల ఉద్యోగాలు

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్


కాంగ్రెస్ పార్టీలో చేరిన కన్నారం ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ

హుస్నాబాద్: సీఎం కేసీఆర్ ఉద్యోగం పోతే 2 లక్షల ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు చెబుతున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర హుస్నాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లనే నిరుద్యోగులకు ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తుందని హామీ ఇచ్చారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ప్రజల ఆకాంక్షను నేరవేర్చింది కాంగ్రెస్

సీపీఐ, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యేల పోరాట ఫలితంగా దివంగతవైఎస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించి నియోజకవర్గ ఆకాంక్షలు నేరవేర్చారని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నియోజకవర్గంలోని ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, యువకులు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిగురుమామిడి మండల జెడ్పీటీసీ గీకురు రవీందర్, కన్నారం ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం రామ్‌నగర్, మంగళపల్లి గ్రామాలకు చెందిన 80 మంది నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎంపీ, హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు స్థానికులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.